క్లుప్తంగా

కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులకు అభినందనలు



హోంగార్డులను అభినందిస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన నలుగురిని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదివారం అభినందించారు. జిల్లా పోలీసు శాఖలో హోంగార్డులుగా పని చేస్తూ ఇటీవల రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి వెల్లడించిన ఫలితాల్లో సివిల్ కానిస్టేబుళ్లుగా జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీమాట్లాడుతూ పోలీసుశాఖపై అవగాహన, అనుభవంతో మరింత ఉన్నతంగా సేవలందించాలన్నారు. క్రమశిక్షణ, నిజాయతీతో పని చేసి, పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని, విధుల్లో నిబద్ధతతో పని చేసి, ప్రజలకు సేవలందించాలన్నారు

రైతులకు మెరుగైన సేవలందించాలి



సొసైటీ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం రూరల్: ప్రాథమిక సహకార పరపతి సంఘం(సొసైటీ) చైర్మన్, సభ్యులు రైతులకు మెరుగైన సేవలందించాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం కొంతమూరు, కాతేరు, తొర్రేడు సొసైటీల త్రిమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొని చైర్మన్లు అడ్డాల శ్రీను(కొంతమూరు), నున్న బాబూరావు(కాతేరు), దండమూడి బాపినీడు(తొర్రేడు), పర్సన్స్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మండల టీడీపీఅధ్యక్షుడు మత్సేటిప్రసాద్, మాజీ వైస్ఎంపీపీ గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, పిన్నమరెడ్డి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమ, వ్రతకల్పాలను అందజేస్తున్న సత్య చారిటబుల్ ట్రస్టు సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మోరంపూడి జంక్షన్‌లో సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను, వినాయక వ్రత కల్ప పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యచారిటబుల్ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు తమ్మారవి, ఉపాధ్యాయుల శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రతి ఏడాది పర్యావరణ పరిరక్షణకు మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సత్య చారిటబుల్ ట్రస్టు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు వెరిఫికేషన్ ఇక్కట్లు

- అనర్హత పేరుతో పింఛన్లు తొలగించిన ప్రభుత్వం
- నగరంలో 513 మందికి నోటీసులు
- వైఎస్సార్ సీపీ నాయకులకు వినతి



వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షుడు గుత్తుల మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

రాజమహేంద్రవరం సిటీ: అనర్హత పేరుతో కొంత మంది పింఛన్లను తొలగించడంతో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలతో జీవనాధారాన్ని కోల్పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. 2010 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకటించిన దివ్యాంగుల పెన్షన్ పంపిణీ ఇప్పటివరకు నిరంతరాయంగా కొనసాగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజమహేంద్రవరం నగరంలో పలువురు దివ్యాంగులకు ప్రతి నెలా అందే పెన్షన్ నిలిపివేస్తూ నోటీసులు జారీ చేసింది. దీనిపై దివ్యాంగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తన అర్హత నిరూపించుకునేందుకు మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రిలో రీవెరిఫికేషన్ ద్వారా సదరం సర్టిఫికెట్ పొంది తిరిగి అప్పీల్ చేసుకునే దుస్థితి నెలకొందంటూ వాపోతున్నారు.

రాజమహేంద్రవరం నగరంలో 50 డివిజన్లకు సంబంధించి 3586 మంది వివిధ కేటగిరీల్లో దివ్యాంగుల పెన్షన్ అందుకుంటున్నారు. వీరిలో 80 మంది పెన్షన్‌దారులుగా రూ.15,000 సామాజిక భద్రత పెన్షన్‌ను తీసుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిబంధనలను మార్పు చేస్తూ 80 మంది పెన్షన్ దారులలో 23 మందిని అనర్హులుగా గుర్తించి దివ్యాంగుల పెన్షను రూ.6000 అందించే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో ఇప్పటివరకు రూ.15 వేల అందుకున్న పింఛనుదారులు లబోదిబోమంటున్నారు. నగరంలో 50 డివిజన్‌లలో 3,586 మంది దివ్యాంగుల పింఛనుదారుల్లో 513 మంది పెన్షన్ దారులకు నగరపాలక సంస్థ అనర్హులుగా ప్రకటిస్తూ నోటీసులు జారీ చేసింది. అయితే సదరం సర్టిఫికెట్లు తిరిగి పొంది అప్లై చేసుకున్నట్టయితే పింఛన్‌ను పునరుద్ధరిస్తామంటూ నగర పాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. నగరంలో 513 మంది నోటీసులు అందుకున్న పెన్షన్ దారులలో 18 సంవత్సరాలలోపు మెంటల్లీ రిటైర్డ్ పెన్షన్ దారులను గుర్తించి 144 మందిని ఈ జాబితా నుంచి తొలగించి వీరికి సెప్టెంబర్‌కు సంబంధించి యథాతథంగా పెన్షన్ అందజేస్తామంటూ అధికారులు చెబుతున్నారు. అయితే మిగిలిన 377 మంది ప్రభుత్వాసుపత్రిలో రీవెరిఫికేషన్ చేయించుకుని సదరం సర్టిఫికెట్ పొంది అప్పీల్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అనర్హులుగా గుర్తించిన పెన్షన్‌దారులు ఈ నెల 25వ తేదీ లోపు అప్పీల్ చేసుకోవాలంటూ అధికారులు సూచిస్తున్నారు. అయితే తమకు కూటమి ప్రభుత్వ తీరని అన్యాయం చేసిందని వైఎస్సార్ సీపీ తరుపున సహాయం అందించి ఆదుకోవాలని పలువురు దివ్యాంగులు వైఎస్సార్ సీపీ నగర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గుత్తుల మురళీధర్‌ను ఆశ్రయించి వినతిపత్రం అందించారు.

ఇది చాలా దారుణం



రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులపై అవలంబిస్తున్న తీరు ఇబ్బందికరంగా ఉంది. పర్సెంటేజీలను తగ్గిస్తూ నిబంధనలను ఏర్పాటు చేయడంతో నగరంలో చాలా మంది దివ్యాంగులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. 2010లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన పెన్షన్ విధానంలో పర్సెంటేజీలు పొందిన దివ్యాంగులకు యథావిధంగా పెన్షన్ అమలు చేసేలా చర్యలు చేపట్టాలి.

– వీరవెంకట రమణ, రాజమహేంద్రవరం

నిరాహార దీక్ష చేస్తాం



దివ్యాంగులకు పెన్షన్ అమలు చేయకపోతే ప్రత్యక్ష పోరాటం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకంలో దివ్యాంగులకు అందిస్తున్న పెన్షన్ను అర్ధాంతరంగా నిలిపివేయడం దారుణమైన విషయం. ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మా దివ్యాంగుల పెన్షన్‌ను అర్ధంతరంగా, నిస్సిగ్గుగా తొలగించడం దారుణం

– సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి, దివ్యాంగులు హక్కులు పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, రాజమహేంద్రవరం

మా బాధలు పట్టించుకోండి



ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మా దివ్యాంగులను పట్టించుకునే నాథుడే లేడు. మా బాధలను ఎవ్వరి చెప్పుకోవాలో తెలియక పరిస్థితి నెలకొంది. ఎటువంటి సమాచారం లేకుండా కేవలం అనర్హత వేటుతో మా దివ్యాంగుల పెన్షన్ రద్దు చేయడం దారుణం. వేరే ఇతర ఆదాయ మార్గాలు ఏమీలేవు. ప్రభుత్వం కరుణించాలి.

– కర్రి చంద్రమౌళి, దివ్యాంగుడు రాజమహేంద్రవరం

వరలక్ష్మీ కాలనీలో మెగా ప్లాంటేషన్



క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో ప్లాంటేషన్ చేసిన విద్యార్థులు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట వరలక్ష్మీనగర్‌లో ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, యానియేషన్, బిజినెస్ కళాశాలకు చెందిన 100 మంది ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సంయుక్తంగా ఆదివారం క్లీన్ అండ్ గ్రీన్, మెగా ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్‌తోపాటు పార్కు ప్రాంగణంలో పది అడుగుల 50 మామిడి, నేరేడు, దేవకాంచన తదితర మొక్కలు నాటారు. ముందుగా వలంటీర్లు ప్లాస్టిక్‌ను ఏరి వేసి, దట్టంగా పెరిగిన గడ్డి జాతికి చెందిన కలుపు మొక్కలను కొడవలితో కోసి తొలగించడం, వ్యర్థ పదార్థాలను ఎండిన చెట్లను తీసివేసి శుభ్రం చేశారు. ప్రాంగణమంతా పరిశుభ్రంగా చేశారు. ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డా.గోలి రామారావు, ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు సుధాకర్ పట్నాయక్, చందన రాజు, అనురాధ తదితరులు సేవలందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, ఆకుల శిరీష, పోలుకొండ సాయి, బి.విమల, బి.కిరణ్, గ్రామపెద్దలు, పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాథ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, రెడ్‌క్రాస్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



కడియం హైస్కూల్‌లో కలుసుకున్న 1990-95 బ్యాచ్ విద్యార్థులు

కడియం: మండల కేంద్రమైన కడియంలో ఏవీఆర్ ఉన్నత పాఠశాలలో 1990–95 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం మరోసారి అదే పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు 30 సంవత్సరాల తరువాత ఒకచోట చేరిన వారంతా ఉదయం నుంచీ ఉత్సాహంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తామంతా ఒక చోటుకు చేరేందుకు కృషి చేసిన తోటి మిత్రులను అభినందించారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆగ్రహం
- ఏఈకి షోకాజ్ నోటీసులు



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వ్యవహారంతో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆదివారం నగరంలో లూథర్‌గిరిలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సెంటర్) ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాంట్ పనితీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో వ్యర్థాల సేకరణ, శుద్ధి, రీసైక్లింగ్, కంపోస్టింగ్ పనుల అమలు పరిస్థితిని పరిశీలించారు. హెల్త్ అధికారుల నుంచి ప్రాసెస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, వ్యర్థాలను వనరులుగా మార్చడంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇంటి వద్ద చెత్త వేరు చేసి అందించడం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావించాలన్నారు. అయితే నగరంలో రోజుకు 160 టన్నుల చెత్త ఉత్పన్నం అవుతున్నా తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటన నేపథ్యంలో ఏఈ గైర్హాజరుపై తీవ్రంగా స్పందించి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఏ స్థాయి అధికారి అయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ రీటా, డీఈ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం ప్రకారమే ఆస్తి పన్ను

- జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి



క్షేత్ర స్థాయిలో భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ప్రతి ఇంటికీ ఆస్తి పన్ను విధిగా ఉండాలని, భవన నిర్మాణం అనుమతి ప్రకారం మాత్రమే నిర్మాణాలు ఉండాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదివారం నగరంలో విద్యానగర్, వీవర్స్ కాలనీ, తాడితోటలోని కరుణ శ్రీ ఆస్పత్రి, జేఎన్ రోడ్డులోని సాల్ట్ హాస్పిటల్, ఏవీఏ రోడ్డులోని పాంటలూన్స్ సహా పలు భవనాలను ఆమె పరిశీలించారు. ఆమోదం పొందిన ప్లానింగ్‌కు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని, ఏమైనా వ్యత్యాసం ఉన్నట్టయితే తగు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అలాగే సచివాలయ పరిపాలన కార్యదర్శులు ఉదయం 8 గంటల నుంచి ఫీల్డ్ లోకి వెళ్లి అండర్ అసెస్మెంట్, అన్ అసెస్మెంట్, ఖాళీ స్థలాలను గుర్తించి పన్ను విధించాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యటన నేపథ్యంలో సచివాలయ అడ్మిన్ ఇందుకు పూర్తి బాధ్యత అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వహించాల్సి ఉంటుందన్నారు. అలాగే సచివాలయాల వారీగా క్షేత్ర స్థాయిలో అనుమతులను అనుసరించి చేపడుతున్న నిర్మాణాల పురోగతిపై రోజు వారి నివేదికలను అందించాలని ఆదేశించారు. గృహాలు, వాణిజ్య సముదాయాలకు ఇచ్చిన అనుమతులు, అక్కడి నిర్మాణాలు, వాటికి సంబంధించి పన్నులు హేతుబద్ధత విధానంలో ఉన్నాయో లేదా కూడా కచ్చితంగా పరిశీలన చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలు

- ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహకిశోర్



నేరసమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో భూ కబ్జాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. మారిన కొత్త చట్టాలపై అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూ కబ్జాదారులను, రౌడీ షీటర్లను ఎట్టి పరిస్థితులను ఉపేక్షించవద్దని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. డీజీపీ ఆదేశాల మేరకు నూతన చట్టాల విధి విధానాలకు లోబడి 60 రోజులు, 90 రోజులలోపు సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. సాంకేతికతను ఉపయోగించి పెండింగ్ కేసుల్లో పురోగతిని సాధించాలన్నారు. కొత్త చట్టాల నిబంధనలు పకడ్బందీగా అమలు చేస్తూ, ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో డిజిటలైజేషన్ చేయాలన్నారు. గణేష్ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా పోలీసులందరూ పని చేయాలన్నారు. న్యూ క్రిమినల్ లా, ఐసీజేఎస్ వినియోగంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పాత కేసులలో అరెస్టు పెండింగ్ ఉన్న ముద్దాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూలు త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. కార్డన్ సెర్చ్‌లు, నాకా బందీలు, వాహనాల తనిఖీలు తరచూ చేయాలన్నారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే ముందు, వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు విధిగా పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. నేర సమీక్ష వేశంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎన్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎస్‌బీ డీఎస్పీ, సీఐ, జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. వ్యాధులకు వేదికలు

- నిర్వహణ పట్టించుకోని స్థల యజమానులు
- దోమలు, పాములు, పందులకు ఆవాసాలు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



చంద్రేడులో నివాసాల మధ్య తుప్పలతో నిండిన ఖాళీ స్థలం

రంగంపేట: గ్రామాల్లో ఖాళీ స్థలాల నిర్వహణ లేకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. తుప్పలు పెరిగిపోయి చిట్టడవిలా దర్శనమిస్తున్నాయి. ఆ చుట్టు పక్కల వారు చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. అందులోనూ ఇది వర్షా కాలం కావడంతో చెత్తకు తోడు వర్షపు నీరు నిలిచిపోవడం దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో నివాసాల ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలాలు చిన్నపాటి అడవులను తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలు భారీగా పెరిగిపోయి దోమలు, విష సర్పాలకు ఆవాససాలుగా మారుతున్నాయి. ప్రతి గ్రామంలోను కొందరు ఖాళీ స్థలాలు కొనుగోలు చేసి వదిలేస్తున్నారు. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు పెరిగిపోయి వర్షపు నీరు, మురుగు నీరు చేరి దోమలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు విష జ్వరాల బారిన పడుతున్నారు.

పట్టించుకోని యజమానులు

స్థలాల యజమానులు అధిక ధరలు వస్తే లాభానికి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అంత వరకు స్థలాలు ఖాళీగా వదిలేస్తున్నారు. పిచ్చి మొక్కలు తొలగించాలని చుట్టు పక్కల వారు చెప్పినా కనీసం పట్టించుకోవడం లేదని ఇరుగు పొరుగువారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు సాయంత్రం దోమల బెడద ఎక్కువవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను మట్టి వేసి ఎత్తు చేసేలా యజమానులకు సూచించాలని, పిచ్చి మొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

సేవలు మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు

- భారత్ వికాస్ పరిషత్ రీజినల్ ఫైనాన్స్ సెక్రటరీ (సౌత్) రాజగోపాల పాయ్
- విశాఖ ప్రాంత్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజగోపాల పాయ్

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్ర స్థాయిలో భారత్ వికాస్ పరిషత్ సేవలు మరింతగా విస్తృతం చేసేందుకు నూతన కార్యవర్గం నిర్మాణాత్మకమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని భారత్ వికాస్ పరిషత్ రీజినల్ ఫైనాన్స్ సెక్రటరీ (సౌత్) రాజగోపాల పాయ్ పిలుపు నిచ్చారు. స్థానిక హోటల్ సూర్యలో రాష్ట్ర స్థాయి (విశాఖ ప్రాంత్) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. ఏడాది కాలం రాష్ట్ర స్థాయిలో కొనసాగే కార్యవర్గం రాష్ట్ర (విశాఖ ప్రాంత్) అధ్యక్షుడిగా జి.బి.వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా పీవీఎస్. నారాయణ, కోశాధికారిగా తాడోజు సాయి కృష్ణతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, భారత్ వికాస్ పరిషత్ శాఖల విస్తరణ, పని విస్తరణ, కార్యవిక్తార్, కార్యకర్త విక్తార్‌లపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మురళీధర్ సౌత్ రీజినల్ టీం జనరల్ సెక్రటరీ డి.పురుషోత్తమ శాస్త్రి, సౌత్ రీజినల్ టీం, మహిళా బాలవికాస్ డాక్టర్ బి.అనురాధ పాల్గొన్నారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు, తుని, విశాఖ శాఖల నుంచి అధ్యక్షుడు కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

బాలిక గర్భంలో మృత శిశువు

చికిత్స చేసి బయటకు తీసిన వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: దివాన్‌చెరువు గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను గుర్తు తెలియని వ్యక్తి గర్భవతిని చేశాడు. ఆ బాలిక ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. ఆదివారం సాయంత్రం ఆ బాలిక గర్భం నుంచి మృత శిశువు కొంత భాగం బయటకు రావడంతో వెంటనే ఆమెను కొంతమంది రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రి వైద్యులు చికిత్స చేసి ఆ మృత శిశువును బయటకు తీశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక నుంచి బొమ్మూరు పోలీసులు వివరాలు సేకరించినట్టు సమాచారం. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇద్దరిపై కేసు నమోదు

సీతానగరం: కాటవరానికి చెందిన యర్రబోయిన లక్ష్మిని కొట్టిన సంఘటపై వచ్చిన ఫిర్యాదు మేరకు నేలం శ్రీను, నేలం వరలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని శ్రీను, వరలక్ష్మి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి మీరు సారా అమ్ముతున్నారని పోలీసులకు సమాచారం ఇస్తున్నారని చెప్పారు. ఆ సమాచారం లక్ష్మి ఇస్తుందని భావించిన శ్రీను, వరలక్ష్మి అక్కడే ఉన్న లక్ష్మి ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. సారా అమ్ముతున్నట్టు మాపై సమాచారం ఇస్తున్నావని, చంపుతామని భయపెట్టి, చేతులతో కొట్టినట్లు శనివారం లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.